క్లుప్తంగా

నిఘా నీడలో వెంకటగిరి

వెంకటగిరి(సైదాపురం) : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి రూరల్, వెంకటగిరి టౌన్‌లో 400 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అత్యంత సమస్యాత్మక గ్రామాలైన వెంకటగిరిలోని రాణిపేట, పాతకోట, రూరల్ గ్రామాల్లో అమ్మపాళెంలోని మూడు పోలింగ్ కేంద్రాలు, బాలాయపల్లిలో బాలాయపల్లి, జయంపు, సంగవరం, డక్కిలి మండలంలో దేవునివెల్లంపల్లి, పాతనాలపాడు, దగ్గవోలులో పారా మిలటరీ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. వెంకటగిరి సీఐ సంగమేశ్వరరావు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఓటు వేయాలంటే గుర్తింపు పత్రం తప్పనిసరి

గూడూరు రూరల్ : రాష్ట్రంలో సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం కోరింది. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గుర్తింపు కార్డును తీసుకెళ్లాలని పేర్కొంది. 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉన్నా ఓటరుని పోలింగ్ కేంద్రంలోకి అనుమతి ఇస్తామని వెల్లడించింది. వాటిలో
- ఓటరు గుర్తింపు కార్డు • ఆధార్ కార్డు
- పాన్ కార్డు • ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు
- సేవా గుర్తింపు కార్డు
- బ్యాంకు, పోస్టాఫీసు పాస్ బుక్‌లు
- ఆరోగ్య బీమా, స్మార్ట్ కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్ • పాస్ పోర్ట్
- ఎన్‌పీఆర్ కింద ఆర్జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు
- పెన్షన్ డాక్యుమెంట్స్
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఎన్నికలకు అధికారులు జారీ చేసిన ప్రత్యేక గుర్తింపు కార్డులు
- ఉపాధి హామీ జాబ్ కార్డు

కండలేరులో 6.870 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.870 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు



పలుగోడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

దక్కిలి: మండలంలో సోమవారం జరిగే పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల సిబ్బంది ఆయా కేంద్రాలకు సామగ్రితో చేరుకున్నారని వివరించారు. పలుగోడులో ఉన్న 216 పోలింగ్ స్టేషన్‌ను మోడల్ పోలింగ్ స్టేషన్‌గా ఎంపిక చేసినట్టు తెలిపారు. దీని పరిధిలో 2,058 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఎస్‌ఐ చౌడయ్య మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలైన డి.ఉప్పరపల్లి (గొల్లపల్లి), దగ్గవోలు, పాతనాలపాడు, దేవునివెల్లంపల్లి, మాటముడుగు, ఆల్తూరుపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో పర్యవేక్షిస్తున్నట్లు ఎస్‌ఐ చౌడయ్య తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్



గూడూరు :ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

గూడూరు రూరల్ : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటుచేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సాంకేతిక కారణాలతో ఈవీఎంలు పనిచేయకపోతే వెంటనే సరిచేసేలా సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి చేశామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఆరుగురు సిబ్బంది ఉంటారని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందని, పోటీ చేసే అభ్యర్థులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన వారందరూ తప్పకుండా తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

గూడూరు మండలం తిప్పవరప్పాడులో రూ.23.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే



గూడూరు పట్టణంలో రూ.1.15 కోట్లతో నూతనంగా నిర్మించిన రైతు బజార్



సైదాపురం: నాడు-నేడు కింద అభివృద్ధి చెందిన పాలూరు దళితవాడ పాఠశాల



కార్పొరేట్‌ను తలదన్నేలా అభివృద్ధి

విద్యతో పేదరికాన్ని పారదోలవచ్చని పెద్దలు చెబుతారు. బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని చాలామంది నిరూపించారు కూడా. అందుకే భారత రాజ్యాంగం విద్యను సామాజిక బాధ్యతగా గుర్తించింది. 14 ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అందించాలని సూచించింది. 40 సంవత్సరాల రాజకీయ నాయకుడినని, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే వ్యక్తి విద్య ప్రభుత్వ బాధ్యత కాదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్‌కు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుని పలు పాఠశాలలను మూసివేశారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యను సామాజిక బాధ్యతగా గుర్తించింది. పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి విద్యే అని ముఖ్యమంత్రి భావించారు. అందుకే విద్యకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. నాడు–నేడు కింద పాఠశాలలను బాగు చేయాలని సంకల్పించారు. రూ.కోట్లు వెచ్చించి వాటి రూపురేఖలను మార్చారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా వసతులు కల్పించారు. డిజిటల్ తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. తద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేశారు. అదేవిధంగా

గూడూరు పట్టణంలో రూ.22 కోట్లతో నిర్మిస్తున్న ఏరియా ఆస్పత్రి భవనం



వైద్యరంగంలోనూ వినూత్న మార్పులు తీసుకువచ్చారు. పాడుబడిన గదులు, సిబ్బంది, మందుల కొరత నుంచి అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మించారు. వైద్య నిపుణులను నియమించారు. పేదల ఇంటి వద్దకే వైద్యులను పంపి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా ఆరోగ్యాంధ్రగా రూపొందించారు.

– సాక్షి నెట్‌వర్క్

సైదాపురం: పాలూరు దళితవాడ, గ్రామంలో అభివృద్ధిచేసిన బీటీ రోడ్డు



మా ఊరు బడి.. రోడ్లు బాగుపడ్డాయి



మా ఊరు సైదాపురం మండలం పాలూరు రాజుపాళెం. నేను చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. మా ఊర్లో గతంలో ఎన్నడూ లేని విధంగా పలు అభివృద్ధి పనులు జరిగాయి. గతంలో దళితులు అంటేనే చిన్న చూపు చూసేవారు. ఈ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలతో పాలూరు దళితవాడలో నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అలాగే కుంటలు, మిట్టలుగా ఉన్న మా రోడ్లను బీటీ రోడ్లతో అభివృద్ధి చేశారు. చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వంలో ఇలా మా ఊరులో ఇంత అభివృద్ధి జరిగి ఉంటే.. రాష్ట్రంలో ఎంత అభివృద్ధి జరిగి ఉంటుందో ఇట్టే అర్థమవుతుంది.

– చెమిర్తి శ్రీనివాసరాజు, పాలూరు రాజుపాళెం

అభివృద్ధి అంటే ఇదే కదా



గతంలో మా బంధువుల స్వగ్రామైన కొమ్మిపాడు లో ప్రభుత్వ కార్యాల యాలు ఉండేవి కాదు. రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. ఏదైనా పని కావాలంటే మండల కేంద్రమైన సైదాపురం రావాల్సిందే. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ గ్రామంలో సీసీ రోడ్లను బాగు చేసింది. ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అగ్రి ల్యాబ్‌లు, సచివాలయాలు ఏర్పాటుచేసి స్థానికంగానే ప్రభుత్వ సేవలు అందించింది. నాడు–నేడు కింద పాఠశాలలను బాగు చేసింది. గతంలో ఉన్న బడి ఇదేనా అన్న ఆశ్చర్యం కలుగుతోంది. అభివృద్ధి అంటే ఇదే కదా.

– గోపువరం మురళీమోహన్‌రెడ్డి, సైదాపురం



వాకాడు : నాడు కొండూరుపాళెం పాఠశాల



వాకాడు : గత ప్రభుత్వంలో విద్యార్థుల స్థితి



వాకాడు : నేడు కొండూరుపాళెం పాఠశాల :



వాకాడు :నేటి ప్రభుత్వంలో విద్యార్థుల స్థితి



వెంకటగిరిలో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం

ఎన్నికలకు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు
- 2,45,205 మంది ఓటర్లు

చిల్లకూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరిగే పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గూడూరు నియోజకవర్గంలో ఐదు మండలాలతో పాటు మున్సిపాలిటీలో మొత్తం 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో అన్ని వసతులు కల్పించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు ఆదివారం సాయంత్రానికే పోలింగ్ అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. ఎండ తీవ్ర ఎక్కువగా ఉన్న నేపథ్యంలో షామియానాలు, బారికేడ్లు, దివ్యాంగులకు అనువుగా ఉండేలా ర్యాంపులు ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ట్రై సైకిళ్లు అందుబాటులో ఉంచారు. గూడూరు పట్టణ ప్రాంతంలో 81 పోలింగ్ కేంద్రాలు ఉండగా రూరల్ ప్రాంతంలో 30, చిల్లకూరు మండలంలో 51, కోట మండలంలో 52, వాకాడు మండలంలో 36, చిట్టమూరు మండలంలో 44 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2,45,205 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,19,164 మంది, మహిళలు 1,26,007 మంది ఉన్నారు. 34 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. నియోజకవర్గంలో పురుషుల కన్నా 6,843 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు.



చిల్లకూరు మండలం ఉడతావారిపాళెం పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్న రెవెన్యూ అధికారులు

3,147 మంది దివ్యాంగులు

గూడూరు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో 3,147 మంది దివ్యాంగులు ఉన్నారు. వారు ఓటు హక్కును వినయోగించుకునే సమయంలో ఆయా పోలింగ్ కేంద్రాల వంద్ద ఉండే సిబ్బంది సహకారం అందిస్తారు. బధిరులు ఓటు హక్కును వినయోగించుకునే సమయంలో ఒక సహాయకుడిని తీసుకెళ్లే వెసులుబాటు కల్పించారు.

పెంచలకోనలో ఘనంగా రామానుజ జయంతి

రాపూరు: పెంచలకోనలో ఆదివారం రామానుజ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతోపాటు రామానుజ విగ్రహానికి పాలు, చందనం, నెయ్యి, తేనె, వివిధ రకాల పళ్ల రసాలతో అభిషేకం చేశారు. సాయంత్రం అలంకార మండపంలో తిరుచ్చిలో కొలువుదీర్చి మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో క్షేత్రోత్సవం నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయండి

వాకాడు : మండలంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ నరసింహారావు కోరారు. మండలంలో 36 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం పోలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, పోలీసు భద్రత ఏర్పాటు చేశామన్నారు.

పోలింగ్‌కు వేళాయే..

- వెంకటగిరి నియోజకవర్గంలో 2,43,582 మంది ఓటర్లు
- 299 పోలింగ్ కేంద్రాలు.
- పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం
- బరిలో 10 మంది ఎమ్మెల్యే, 23 మంది ఎంపీ అభ్యర్థులు

వెంకటగిరి (సైదాపురం): సార్వత్రిక ఎన్నికల ప్రధాన ఘట్టమైన పోలింగ్‌కు వేళయింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ కొనసాగనుంది. వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి, కలువాయి మండలాలకు చెందిన 2,43,582 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇక్కడ 10 మంది ఎమ్మెల్యే, 23 మంది ఎంపీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఇబ్బందులు కలగకుండా 20 నుంచి 30 శాతం ఈవీఎంలను అదనంగా సిద్ధం చేసినట్టు రిటర్నింగ్ అధికారి ధ్యానచంద్ర తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి పీవో, ఏపీవోలతో పాటు మరో ఎనిమిది మంది సిబ్బందిని నియమించినట్టు పేర్కొన్నారు. బీఎల్‌వోలు అదనంగా కేంద్రాల వద్ద ఉంటారని వెల్లడించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేయడంతోపాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థుల మూడు వాహనాలకు మాత్రమే 100 మీటర్ల లోపు నిలిపి వేసి కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతి ఇస్తామన్నారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఆయా ఈవీఎంలను బందోబస్తు మధ్య తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీకి తరలించనున్నట్లు తెలిపారు.



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి సిద్ధమైన ఎన్నికల అధికారులు

నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల వివరాలు.,...

మండలం	పురుషులు,	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం.
కలువాయి	18384	19091	–	37475
రాపూరు	19713	20516	1	40230
సైదాపురం	19040	20175	–	39215
బాలాయపల్లి	13460	14197	–	27652
డక్కిలి	16322	16851	1	33174
వెంకటగిరి	21363	22997	2	44362
రూరల్	10606	10868	–	21474

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు..

వెంకటగిరి నియోజకవర్గంలో 299 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తీసుకుని 88 బస్సుల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 2019 ఎన్నికల్లో జరిగిన ఘర్షణలు, వివాదాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. వెంకటగిరి నియోజకవర్గంలో 58 సమస్యాత్మక, 35 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్టు అధికారులు పేర్కొన్నారు. 78 పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీతో పోలింగ్ సరళిని చిత్రీకరించనున్నారు.



ఈవీఎంలు, పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు



ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా ఏర్పాట్లు చేశాం. కేంద్ర, రాష్ట్ర పారా మిలిటరీ దళాలతో భద్రత కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి. అన్ని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాయి. 149 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ వెబ్ కాస్టింగ్ పెట్టాం. సీసీ టీవీ కెమెరా రికార్డింగ్ ఉంటుంది.

– ధ్యానచంద్ర, రిటర్నింగ్ అధికారి, వెంకటగిరి.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు



సైదాపురం చేరుకున్న పోలింగ్ సిబ్బంది



బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలు

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- 144 సెక్షన్ అమలు

సైదాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సైదాపురం మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు. నియోజకవర్గ కేంద్రమైన వెంకటగిరి నుంచి పోలింగ్ అధికారులు, సిబ్బంది ఈవీఎంలతో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం జరిగే ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు మండలానికి సుమారు 150 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేసినట్టు అధికారులు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసులను నియమించామని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయా కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని తీసుకుని వెళ్లేందుకు ఆరు రూట్ అధికారులను నియమించారు. ఈ దఫా రూట్ అధికారులకు ఆన్‌లైన్ సేవలు అందించే సెల్ ఫోన్లను అందించారు. వాటి ద్వారా ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిపై ఉన్నతాధికారులు సమీక్షించనున్నారు. మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో సోమవారం నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఆదివారం సాయంత్రానికి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 40,230 మంది ఓటర్లు ఉన్నారు. 51 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు.

తొలిసారి ఓటు వేయనున్న 5,320 మంది యువత

గూడూరు రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరగనున్న ఎన్నికల్లో 120–గూడూరు అసెంబ్లీ నియోజకవర్గంలో తొలిసారి 5,320 మంది యువత ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో 2,928 మంది యువకులు, 2,392 మంది యువతులు ఉన్నారు. అదే విధంగా 20 నుంచి 30 ఏళ్ల లోపు ఉన్న ఓటర్లు 42,187 మంది. వారిలో 21,952 మంది పురుషులు, 20,223 మంది మహిళలు ఉన్నారు. అలాగే దివ్యాంగులు 3,174 మంది. ఇందులో పురుషులు 1,777, మహిళలు 1,397 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,45,205 మంది. పురుషులు 1,19,164 మంది, మహిళలు 1,26,007 మంది ఉన్నారు.

మండలాల వారీగా..

గూడూరు పట్టణంలో విలీన గ్రామాలతో కలిపి 75,938 మంది ఉన్నారు. వారిలో పురుషులు 36,521 మంది, మహిళలు 39,391 మంది ఉన్నారు. గూడూరు మండలంలో 23,543 మంది ఓటర్లు ఉండగా ఇందులో 11,649 మంది పురుషులు, 11,894 మంది మహిళలు ఉన్నారు. అలాగే చిల్లకూరు మండలంలో 41,196 మంది ఓటర్లు ఉండగా 20,159 మంది పురుషులు, 21,037 మంది మహిళలు ఉన్నారు. కోట మండలంలో 42,334 మంది ఓటర్లు ఉండగా, 20,390 మంది పురుషులు, 21,940 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వాకాడు మండలంలో 30,246 మంది ఓటర్లు ఉండగా, 14,655 మంది పురుషులు, 15,591 మంది మహిళలు ఉన్నారు. చిట్టమూరు మండలంలో 31,948 మంది ఓటర్లు ఉండగా, 15,790 మంది పురుషులు, 16,154 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అదే విధంగా 85 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు 1,394 మంది ఓటర్లు ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

గూడూరు నియోజకవర్గంలో మొత్తం 109 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. గూడూరు పట్టణంలో 29, రూరల్‌లో 17, చిల్లకూరు మండలంలో 16, కోట మండలంలో 22, వాకాడు మండలంలో 15, చిట్టమూరు మండలంలో 10 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 109 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు.

పోలింగ్ బూత్‌ల వివరాలు...

గూడూరు నియోజవర్గంలో 294 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. గూడూరు మండలంలో 1వ నంబర్ నుంచి 7వ నంబర్ వరకు, 89 నుంచి 111వ నంబర్ పోలింగ్ బూత్ వరకు మొత్తం 30 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. గూడూరు పట్టణంలో 8వ నంబర్ పోలింగ్ బూత్ నుంచి 88వ నంబర్ బూత్ వరకు మొత్తం 81 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. చిల్లకూరు మండలంలో 112వ నంబర్ బూత్ నుంచి 162వ నంబర్ వరకు మొత్తం 51 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. కోట మండలంలో 163వ నంబర్ నుంచి 214వ నంబర్ వరకు మొత్తం 52 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వాకాడు మండలంలో 215 నుంచి 241 వరకు, 254, 255 బూత్‌లతోపాటు 288 నుంచి 294 బూత్ వరకు మొత్తం 36 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. చిట్టమూరు మండలంలో 243వ నంబర్ నుంచి 253 వరకు, 256 నుంచి 287వ నంబర్ వరకు మొత్తం 44 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.

క్లుప్తంగా

సమస్యాత్మక కేంద్రాల వద్ద నిఘా



నాయుడుపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస రెడ్డి

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సారథ్యంలో గట్టి పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండల పరిధిలోని మేనకూరు, గొట్టిప్రోలు, విన్నమాల, అన్నమేడు, పూదూరు, బిరదవాడ, జువ్వల పాళెం, చిలమత్తూరు తదితర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను వద్ద కేంద్ర బలగాలతో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. మండలంలో మొత్తం 9 మొబైల్ టీములతో పాటు 4 క్విక్ రెస్పాన్స్ టీములతో పహారా కాస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా 114 సెక్షన్ అమల్లో ఉంటుందని జనాలు గుంపులుగా ఉండరాదని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల దూరంలో ఎలాంటి ప్రచారాలు చేయరాదన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వచ్చి వినియోగించుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు

నాయుడుపేటటౌన్: మండలంలో మొత్తం 74 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో పాటు ఎన్నికల అధికారులు ఆదివారం చేరుకున్నారు. మండలం మొత్తం మీద 59,377 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మొత్తం 50,377 మంది ఓటర్లలో 28,,509 మంది పురుషులు, 30,861 మంది మహిళలు, 7మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే అన్ని కేంద్రాల వద్దకు ఎన్నికల సరంజామాను సిబ్బంది చేరుకున్నారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు నిఘా ఏర్పాటు చేశారు.

మద్యం అక్రమ విక్రయాల కట్టడికి చర్యలు

నాయుడుపేటటౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం అక్రమ విక్రయాల కట్టడికి చర్యలు చేపట్టినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ గౌస్‌బాషా ఆదివారం తెలిపారు. తమ డిపో పరిధిలోని సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో 11వ తేదీ నుంచి 13 తేదీ సాయంత్రం 6 గంటలకు వరకు డ్రైడేలు పాటిస్తూ మద్యం విక్రయాలు జరుపకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే వారిపై కఠిన చర్యలు చేపడుతామన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం వితరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి ఆదివారం పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు 2.318 కేజీల బరువు గల రూ.2.25లక్షలు విలువైన వెండికిరీటాన్ని వితరణ చేశారు. దీనిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆదిశంకరాచార్యులకు పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడి ఆవరణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి విశేష పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ పాల్గొన్నారు.

వేడుకగా భాష్యకార్ల ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఆదివారం భాష్యకార్ల(శ్రీరామానుజాచార్యుల) ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు భాష్యకార్ల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్న మాడ వీధి ఉత్సవం, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7గంటల వరకు పెద్ద మాడవీధి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు.

సూళ్లూరుపేటలో అభివృద్ధి చేసిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్



పెళ్లకూరు మండలంలో బాగుచేస్తున్న సాగునీటి కాలువ



నూతనంగా నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్



కళ్లెదుటే ... ఊరూరా అభివృద్ధి!

సూళ్లూరుపేట/నాయుడుపేట : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం 129 పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల్లో రూ.1600 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసింది ఈ ప్రభుత్వమే. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో పట్టణాల రూపురేఖలు మారాయి. నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయాలు, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు, పాల సేకరణ కేంద్రాలు, సాగునీటి కాలువల మరమ్మతులు, రోడ్లు, డ్రైనేజి వ్యవస్థలన్నీ మెరుగుపడ్డాయి. మేనకూరులో నిర్మించిన వైఎస్సార్ స్మృతి వనం ఆహ్లాదకరంగా ఉంది. మేనకూరు పంచాయతీ కేంద్రంగా అన్ని ప్రభుత్వ భవనాలను ఒకే ప్రాంగణంలో నిర్మించారు.

మారిన రూపురేఖలు

ఎన్నికల్లో ఓటు వేసేందుకు పక్క రాష్ట్రాల నుంచి గ్రామాలకు విచ్చేసిన వారు గతంలో తాము చదివిన బడులను చూసి ఆశ్చర్య పోతున్నారు. వాటి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దీంతో పాఠశాలలు ఇంతలా మారాయా అని ముక్కున వేలేసుకుంటున్నారు. తాము చదివే రోజుల్లో బడులు ఇలా మారుతాయని కూడా ఊహించలేదని చెబుతున్నారు. అప్పట్లో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే ఇలాంటి వసతులు ఉండేవని గుర్తు చేసుకుంటున్నారు. పేద, మధ్యతరగతి పిల్లలకు సర్కారు బడుల్లో ఉచితంగా కార్పొరేట్ విద్యను అందివ్వడం గొప్ప విషయమని ప్రశంసిస్తున్నారు.

లంచాలకు స్వస్తి

ఎలాంటి లంచం ఇవ్వకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా ఇంటి వద్దకే అందించడం దేశంలోనే ఎక్కడా లేదని చెబుతున్నారు. ఇంత మార్పు ఎప్పుడూ చూడలేదంటున్నారు. కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీలతో సంబంధం లేకుండా ప్రస్తుత ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడం అద్భుతమని వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో తమ తల్లిదండ్రులను కంటికి రెప్పలా వలంటీర్లు కాపాడారని ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన ఇక్కడి ఓటర్లు వెల్లడిస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వలంటీర్ వ్యవస్థను తీసుకురావడంపై అభినందనలు కురిపిస్తున్నారు. ఇలాంటి విప్లవాత్మకమైన పథకాలతో అండగా నిలిచిన వారికే తమ మద్దతని స్పష్టం చేస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు అద్భుతం

ఫ్యామిలీ డాక్టర్ విధానం అద్భుతంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇంటి వద్దకే వైద్యమా ఇలాంటి సౌకర్యం ఎక్కడా లేదే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విదేశాల్లో సైతం ఇలాంటి సౌకర్యం లేదని వెల్లడిస్తున్నారు. గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళితే కనీసం మందులు కూడా ఉండేవి కావని, ఇప్పుడు ఇంటికే ఫ్యామిలీ డాక్టర్ విధానం కింద వైద్యులు వస్తున్నారని వివరిస్తున్నారు. ఇంత మేలు చేసిన ప్రస్తుతం ప్రభుత్వ పనితీరు ప్రశంసనీయమని, పేదలకు ఇలాంటి పాలకులే కావాలని స్పష్టం చేస్తున్నారు.











ఆదర్శంగా అభివృద్ధి పనులు



ఈ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక మేనకూరులోనే సుమారు అయిదారు రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేసింది. ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్ని కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో నిర్మించింది. నాయుడుపేట మండలంలోనే మేనకూరు పంచాయతీ ఆదర్శంగా నిలిచింది. కల్లబొల్లి మాటలు చెప్పేవాళ్లు పాలకులుగా కాకుండా చెప్పింది చెప్పినట్టుగా చేసే వారిని ఆదరించాలి.

– బీ అల్లెయ్య, నాయుడుపేట

అభివృద్ధికి అండగా నిలవాలి



మేనకూరు పరిశ్రమల కేంద్రంగా ఎంతో అభివృద్ధిని సాధించింది. నిరంతరం అభివృద్ధిని ఆకాంక్షించే ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలివాలి. హామీలు మాత్రమే ఇచ్చి, ఆ తరువాత స్వార్థ రాజకీయాలు చేసే నాయకులకు ఓటుతో తరిమికొట్టాలి. ఎన్నికలయ్యాక కూడా ప్రజల బాగోగులు చూసే వారిని ఇంటివద్దకు పథకాలు అందించే ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది.

– కే భవాని శంకర్ రెడ్డి, మేనకూరు

చెప్పింది చేసే నాయకులు కావాలి



చెప్పింది తప్పకుండా చేసే నాయకులు కావాలి. ఎందుకంటే మేనకూరు లాంటి మారుమూల వుండే పల్లెటూరుకే మినీ పట్టణంగా మార్చారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఈ ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, గతంలో ఎప్పుడూ చూడలేదు. గత ప్రభుత్వంలో నాయకులు నిధులన్నీ దోచుకోవడానికి చూశారు. కానీ ఈ ప్రభుత్వం ప్రజల మంచి కోసం నిరంతరం కృషి చేస్తోంది.

– ఎస్ కస్తూరయ్య, మేనకూరు, నాయుడుపేట మండలం



మేనకూరులో ఒకే చోట నిర్మించిన అన్ని రకాల ప్రభుత్వ భవనాలు, వైఎస్సార్ స్మృతి వనం

నిఘా నీడలో పోలింగ్ కేంద్రాలు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 37 పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అధికారులు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లు తదితర వాటిని ఆదివారం సాయంత్రం కమిషనర్ స్థానిక సీఐ శ్రీనివాసరెడ్డితో కలసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కెమెరాలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లను అధికారులు చేశారు. దివ్యాంగులు సైతం ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వీల్ చైర్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ఎండ తీవ్రతలో నిలబడేందుకు షామియానాలు వేసినట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటికే బీఎల్‌ఓలు వారి పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన స్లిప్పులను పంపిణీ చేసి అడ్రస్ తెలియని వాటిని బీఎల్‌ఓల వద్ద ఉంచుకుని వాటిని ఎన్నికల రోజున కేంద్రాల వద్ద ఉండి ఓటర్లకు అందించేలా చర్యలు చేపట్టి ఉన్నారు. దీంతో ఓటర్లు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి వారి ఓటర్ల స్లిప్పులతో పాటు వివరాలు తెలుసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్ జనార్దన్ రెడ్డి, సీఐ శ్రీనివాసరెడ్డి

తిరుపతి గంగ జాతర పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మకు మంగళవారం చేపట్టే చాటింపుతో అమ్మవారి గంగజాతర ఆరంభం కానుంది. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి గంగమ్మ తల్లి జాతరను పురస్కరించుకొని తిరుపతి నగరంలోని వ్యాపార సంస్థలు అమ్మవారి జాతర ప్రచారం పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలు, బారికేడ్లు, డస్ట్‌బిన్స్ తదితర సామగ్రిని ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతర పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను ఆలయ ఈఓ కె.మమత వ్యాపార సంస్థల ప్రతినిదులతో కలిసి ఆవిష్కరించారు. శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ ఆధ్వర్యంలో 25 బారికేడ్లు, 2 వేల పోస్టర్లు, 25 డస్ట్‌బిన్లు, ఒక వాటర్ కూలర్ అందించారు. అలాగే సీఎంఆర్ షాపింగ్ మాల్ వారు 17 బారికేడ్లు, రెండువేల పోస్టర్లు, కరపత్రాలు అందజేశారు. మెడిమిక్స్ సంస్థ వారు జాతర ఆహ్వాన బుక్‌లెట్స్, 2 వేల పోస్టర్లు, 20 బ్యానర్లు, అభిరుచి ఫుడ్స్ వారు ప్రసాదం బ్యాగులు, జాతర కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఈఓ కె.మమత మాట్లాడుతూ వారం రోజులపాటు జరిగే అమ్మవారి జాతర మరింత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.









సూళ్లూరుపేట: ఎన్నికల సామగ్రిని తీసుకెళుతున్న పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు వచ్చిన బస్సులు, దొరవారిసత్రం : పోలిరెడ్డిపాళెంలో ఏర్పాటు చేసిన క్యూలు, కేసీఎన్‌గుంట గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన షామియానా

నేడే ఎన్నికల సమరం.. సర్వం సిద్ధం

సూళ్లూరుపేట : నియోజకవర్గంలో సోమవారం నిర్వహించనున్న ఎన్నికల సమరానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. పోలింగ్‌కు సంబంధించి ఆదివారం ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. సూళ్లూరుపేట ఎన్నికల అధికారి ఆర్ చంద్రముని ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలతో పాటు ఇతర సామగ్రిని సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 304 పోలింగ్ కేంద్రాల్లో 2,42,610 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ నిర్వహణకు 333 మంది పోలింగ్ అధికారులు, 245 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, 95 మంది మైక్రో అబ్జర్వర్స్, 44 మంది సెక్టార్ అధికారులు, వెబ్‌కాస్టింగ్ చేసేందుకు 130 మంది సిబ్బంది పని చేస్తున్నారు. పోలింగ్ నిర్వహణకు నియోజకవర్గంలో 44 మంది సెక్టోరియల్ అధికారులు 44 రూట్లలో ఎన్నికల సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు బస్సుల ద్వారా చేరవేశారు. ఇందులో 304 పోలింగ్ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి ఒక పోలింగ్ అధికారి, ఇద్దరు సహాయ పోలింగ్ అధికారులను నియమించారు. ఈ ఎన్నికలకు ఉపయోగించే ఈవీఎంలు కొత్తవి కావడంతో బ్యాలెట్ పేపర్లు అమర్చి ఒకసారి తనిఖీలు చేసి సిద్ధం చేశారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించారు. సెక్టోరియల్ అధికారులకు 44 చిన్నపాటి వాహనాలు, ఎన్నికల సిబ్బందిని చేరవేసేందుకు 120 బస్సులు ఉపయోగించారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించనున్నామని ఎన్నికల అధికారి ఆర్ చంద్రముని తెలిపారు. ఓటర్లు కూడా స్పందించి ఆయా పోలింగ్ స్టేషన్‌ల వారీగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలను అందజేస్తున్న అధికారులు

ఎన్నికలకు సంబంధించి బందోబస్తు

నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాలు, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో మాత్రం ప్రత్యేక దృష్టి సారించి ఎక్కువ బందోబస్తును ఏర్పాటు చేశారు. చిత్తూరు ఏఎస్పీ బాషా నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో 523 మందితో బందోబస్తు నిర్వహించనున్నారు. ఇద్దరు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 19 మంది ఏఆర్‌పీసీలు, ఏడుగురు పోలీస్ కానిస్టేబుల్స్, 88 మంది రూట్ మొబైల్ సిబ్బంది, నలుగురు ఏపీఎస్పీ, 23 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 99 మంది కానిస్టేబుళ్లు, 128 మంది హోంగార్డులు, 72 మంది కేంద్రాల బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టించినా, గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల స్పెషల్ ఏఎస్పీ బాషా తెలిపారు. ఇప్పటికే 144 సెక్షన్ అమలులో ఉన్నందున అప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు. ప్రజలు కూడా ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆమె కోరారు. అయితే ఇప్పటికే గ్రామాల్లో, సూళ్లూరుపేట పట్టణంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల ఏర్పాటు

సూళ్లూరుపేట రూరల్ : మండల పరిధిలోని రూరల్, అర్బన్‌లో 71 పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో షామియానాలు, క్యూలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ దీపాలు ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, దివ్యాంగులకు వీల్ చైర్ అందుబాటులో ఉంచారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో చేరుకున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుండడంతో ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. మండలంలోని 19 పంచాయతీల్లో 26,643 మంది ఓటు హక్కును వినియోగిచుకోనున్నారు. ఇందులో మహిళలు 13,509 మంది, పురుషులు 13,134 మంది ఉన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని 25వ వార్డులకు గాను 35,643 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 18,388, పురుషులు 17,251 , నలుగురు థర్డ్ జండర్లు ఓటు హక్కును వినియోగిచుకునున్నారు.

ఓజిలిలో..

ఓజిలి: సార్వత్రిక ఎన్నికలకు ఓజిలి మండలంలో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఏఈఆర్‌ఓ నాంచారయ్య ఆధ్వర్యంలో మండలంలో 39 పోలింగ్ కేంద్రాలకు గాను 390 మంది ఎన్నికల అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, లైట్లు తదితర వసతులను కల్పించారు.



వికలాంగుల కోసం 218 పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వీల్ చైర్

ఎన్నికలకు ఏర్పాట్లను పూర్తి చేసి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రవిబాబు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరు సహకరించాలని కోరారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం : మండల పరిధిలో నేడు జరగబోయే ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 41 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి అన్ని సదుపాయాలను కల్పించారు. ఆదివారం సాయంత్రానికే నిర్దేశించిన పోలింగ్ బూత్‌ల వద్దకు పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. మొత్తం ఓటర్లు 28,327 ఉండగా ఇందులో పురుషులు 13,508, మహిళలు 14,812 ఇతరులు ఏడుగురు ఉన్నారని స్థానిక తహసీల్దార్ ప్రసాద్ తెలియజేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు. బూదూరు, తనియాలి, మావిళ్లపాడు, సింగనాలత్తూరు, నేలపట్టు, మైలాంగం, పోలిరెడ్డిపాళెం సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘాతో పాటు పోలీసు బలగాలు కూడా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.





సూళ్లూరుపేట: ప్రత్యేక సమావేశంలో ఎన్నికల నిర్వహణపై సూచనలిస్తున్న పోలీసులు అధికారులు, హాజరైన పోలీసు సిబ్బంది



కోటపోలూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది